# ప్రేమదౌత్యం

## సీతాసత్య




'మీఎదురింట్లో కొత్తగా ఎవరో వచ్చినట్టున్నారే మిటీ?' అన్నాడు వినోద్.

'ఆ.. రంగనాథం గారనీ, మా నాన్నగారు పని చేస్తున్న ఆఫీసుకే బదిలీ మీదొచ్చారు. హైదరాబాద్ నుంచి' అన్నాడు మురళి. రాక్‌లోంచి పుస్తకాల్ని బయటకు తీస్తూ.

'ఇంట్లో ఎవరో చాలామందే వున్నట్టున్నారు?' అన్నాడు వినోద్, తల పైకెత్తి కిటికీలోంచి బయటకు చూస్తూ.

'చాలా పెద్ద సంసారంరా వాళ్ళది. రంగనాథం గారూ, ఆయన భార్య, పిల్లలు, ముసలి తల్లీ, విధవచెల్లెలు, ఆవిడ పిల్లలూ.. ఇలా చాలామందే వున్నారాయింట్లో' అన్నాడు మురళీ ఓ పుస్తకాన్నందుకుని, వినోద్‌కెదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

'రంగనాథం గారికి కనీసం నలుగురైదుగురు పిల్లలైనా వుండుండాలే!' అన్నాడు వినోద్ ఇంకా కిటికీలోంచే బయటకు చూస్తూ.

'వాళ్ళ గొడవ మనకెందుగ్గానీ, ముందు పుస్తకం తెరువ్'అన్నాడు మురళి.

'వుండరా. రోజూ వుండే చదువేగా! నేను వారం రోజులు మీ యింటికి రాకపోయే సరికి మీ ఇంట పరిసర వాతావరణమే మారిపోయినట్టుగా వుంది నాకు. అవునుగానీ ఆయనకు పిల్లలెంతమందిరా?' అన్నాడు వినోద.

మిత్రుడిక్కావాల్సిన సమాచారం అందించే వరకు ఆరోజుకు పుస్తకం తెరిచే అవకాశం వుండదనిగ్రహించిన మురళి తప్పనిసరై అన్నాడు 'జనాభా లెక్కలు సేకరించే వాడిలా ఆ సిన్సియారిటీ ఏమిట్రా బాబు నీకు? సరే నాయినానిను. ఆయనకు నలుగురు సంతానం. ఒక ఆడపిల్లా, ముగ్గురు మనలాంటి వాళ్ళూనూ..'

'కొంపతీసి ఆడపిల్లింకా చెడ్డీలు వేసుకునే వయసుది కాదు కదా!' మిత్రుడి మాటలకడ్డు తగులుతూ అన్నాడు వినోద్.

వినోద్ మాటలు విన్న మురళి కళ్ళు వెలుగును నింపుకున్నాయి. 'అదీ సంగతి. అలా రా దారికి.. ఆయన సంతానంలో ఆడపిల్లే పెద్దది. పేరు ప్రియంవద. సన్నగా,నాజూగ్గా వుంటుంది. పచ్చని ఛాయ, ఇంట్లో లంగా, ఓణీ వేసుకుంటుంది. బయటకెళ్ళినప్పుడు సల్వార్ కమీజు సింగారించుకుంటుంది'.

ఇంట్లో హవాయ్ చెప్పులేసుకుని మెత్తగామా,రోడ్డుమీద హైహీల్స్ చెప్పులువేసుకుని టిక్కుటిక్కు శబ్దం చేస్తూనూ నడుస్తుంది. ఉమెన్స్ జూనియర్ కాలేజీలో సైన్స్ గ్రూపుతో ఇంటర్మీడియట్ చదువుతోంది.

అర్థంకాని విషయాలేమైనా చెప్పి ఆ అమ్మాయికి దగ్గరవుదామనే ఆలోచనుంటే, ఇప్పుడే మనసులోంచి తుడిచేసుకో. చదువులో తను చాలా జీనియస్!

తోటి ఆడపిల్లల్తో మర్యాదగాను, మగపిల్లల్తో కరకుగాను మాట్లాడడం ప్రియంవదకు అలవాటు. గతంలో తను హైదరాబాద్‌లో చదివినప్పుడు మనలాంటి ఆత్రగాళ్ళు రాసిన ప్రేమలేఖలు, వాళ్ళింట్లో నాలుగు బస్తాల నిండా కూరి వున్నాయి. ఆ ప్రేమలేఖలతో కాచుకున్న నీళ్ళనే రోజూ ఇంట్లో అంతా పోసుకుంటారు.

'బహుశా మరో నాలుగైదు నెలల వరకు నీళ్ళు కాచుకునేందుకు బొగ్గులు కొనే అవసరం వుండకపోవచ్చనీ, ఈ ఊళ్ళో కూడా మరికొన్ని రోజులు గడిస్తే మరిన్ని బస్తాల ఉత్తరాలొస్తాయి కనుక,ప్రియంవదకు పెళ్ళయి అత్తారింటికి వెళ్ళే వరకూ, తామే ఊళ్ళో వున్నా బొగ్గుల ఖర్చుండక పోవచ్చని వాళ్ళమ్మగారు మా అమ్మగారితో చెప్తుండగా విన్నాను' అన్నాడు మురళి.

గుటకలు మింగాడు వినోద్, మిత్రుడు చెప్పిందంతా విని.

కాస్సేపాగి 'ఈ ప్రియంవదెవరో గానీ ఛాలెంజింగ్ కేసే!' అన్నాడు వినోద్.

'ఇంకా ఏవైన విశేషాలుంటే చెప్పగురూ!' అనర్థం వచ్చేలా.

'ఆ.. నిస్సందేహంగా ఛాలెంజింగ్ కేసే! ప్రియంవద కాలికి చెప్పులున్నంతవరకు మగవురుగు కూడా ఆమె జోలికి పోయేందుకు సాహసించదట. హైదరాబాద్‌లో ఆమె చేత చెప్పదెబ్బలు తిన్న మన సోదరులు, పళ్ళురాలిపోయి ఒకడూ, దవడ ఎముక విరిగిపోయి ఒకడూ, కన్నువాచిపోయిన వాడు మరొకడు, కళ్ళీ బుగ్గన పెట్టుకున్న వాడిలా వాడొకడు.. ఇలా చాలామందే వున్నారట.

చిత్రమేమిటంటే వాళ్ళుండే ఏరియాలో కళ్ళ మరియు పళ్ళడాక్టర్లతో పాటు ఎముకల డాక్టర్ల ప్రాక్టీసు కూడా విపరీతంగా పెరిగిపోయిందట, వాళ్ళక్కడున్నంత కాలం.

రంగనాథం గారికి ఈ ఊరికి ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతున్నారని తెలిసి, ఆ ఏరియాలోని డాక్టర్లంతా కలసికట్టుగా ప్రియంవద వాళ్ళింటికి వచ్చి 'అయ్యా మీకిదేమైనా న్యాయంగా వుందా? విదేశాల కెళ్దామంటే ఓ పట్టాన వీసా దొరకని మాలాటి వాళ్ళందరికీ ఏదో మీ పుణ్యవాని స్వదేశంలోనే, నోట్లోకి నాలుగు మెతుకులు వెళుతున్నాయి. మమ్మల్నిపుడిలా వట్టేట్లో ముంచేసి మీ దారి మీరు చూసుకుంటే మాగతేం కాను?' అని రంగనాథం గారి ముందు బావురుమన్నారట.

ఆయన నిస్సందేహంగా ప్రియంవద వైపు చూశారట. వాళ్ళంతా ప్రియంవదను బ్రతిమాలుకున్నారట. రంగనాథంగారి వయసున్న డాక్టర్లు ఆమెను కన్నకూతురిలా చూసుకుంటామంటే, కుర్రడాక్టర్లు, ఆమెను తోడబుట్టిన చెల్లెల్లా చూసుకుంటామనీ, తమ దగ్గరే వుండమని ప్రాధేయపడ్డారట.

రంగనాథం గారికి అమ్మాయిని చూడాలనిపించి హైదరాబాద్ వచ్చినా లేదా ప్రియంవదకు అమ్మా నాన్నలను చూడాలనిపించి ఈ ఊరు వెళ్ళాలనిపించినా, దారి ఖర్చులు కూడాతామే పెట్టుకుంటామన్నారట.

అప్పుడు ప్రియంవద వాళ్ళ అమ్మగారు 'వయసొచ్చిన పిల్లను పరాయింట్లో ఎలా వుంచుతాం నాయనా! అంతగా కావాలంటే మీరే మా వూరొచ్చి ప్రాక్టీసు పెట్టుకోకూడదు? మేమెలాగూ ముందుగా వెళ్తున్నాం కనుక మీ అందరికీ ఇళ్ళు చూసుంచుతాం' అన్నారట.

నీకు తెలియదేమో, మరో నెలరోజుల్లో ఆ డాక్టర్లంతా మన ఊరికే, ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే మన వీధికే వచ్చేస్తున్నారు. ప్రియంవద వాళ్ళు ఈ ఊళ్ళో అడుగుపెట్టిన మర్నాటి నుంచి మన ఊళ్ళో, ముఖ్యంగా మన వీధిలో ఇళ్ళకు విపరీతంగా అద్దెలు పెరిగిపోయాయి' అన్నాడు మురళీ గుక్క తిప్పుకుందుకు ఆగి.

'అయ్యాబాబోయే! ఛాలెంజింగ్ కేసే కాదు, ఇది చాలా ప్రమాదకరమైన కేసు కూడా' అని గుండెలు బాదుకుంటూ పుస్తకం తెరిచాడు వినోద్.

మిత్రుడు చెప్పిన వివరాలు నాలుగురోజుల పాటు వినోద్ మనసులో మెదులుతూనే వున్నాయి. అంతవరకు ఆమెను చూడకపోయినా, ఆమె మీద ఇష్టం విపరీతంగా పెరిగిపోయిందతడికి. కంబైన్డ్ స్టడీ కోసం క్రమం తప్పకుండా రోజూ మురళీ వాళ్ళింటికి వస్తున్నా, ఒక్కసారి కూడా ప్రియంవద దర్శనం కాలేదతడికి.

ఓరోజు మురళీ అన్నాడు వినోద్‌తో 'ఈరోజు ప్రియంవద నీ గురించి అడిగిందిరా'

ఎడం చేతిమీదో సారి గిల్లుకుని 'మళ్ళీ చెప్పు!' అన్నాడు వినోద్.

'రోజూ మీ ఇంటికి చీకటి పడ్డాక వస్తుంటాడే, ఎవరతను? అనడిగిందిరా?' అన్నాడు మురళి.

'నీ థిక్కెస్ట్ ఫ్రెండ్‌వని చెప్పలేక పోయాయా?' అన్నాడు వినోద్.

## డింపుల్ చెప్పిన సత్యం

డింపుల్ కపాడియా రూటే వేరు. అందరికీ ఏడాది పోయి ఏడాది వయస్సు పెరిగితే డింపుల్‌కి మాత్రం ఏడాది ఏడాది వెనక్కి జరుగుతన్నట్టుంది. అయినా ఇవ్వాళ్టి హీరోయిన్‌లవి ఏం అందాలంటి? గట్టిగా కండే వుండదు. దిట్టంగా నాలా ప్రౌఢలా వున్నవాళ్ళకే మార్కెట్! జనాల టేస్టు మారిందండి. "అనుభవజ్ఞులకే" అవకాశం ఇస్తోంది ఇండస్ట్రీ. ఈ విషయంలో మాఅమ్మాయి ట్వింక్‌కి పోటీ అయినా నేను బాధపడేదేం లేదు. ఎవరి అందాలు చందాలు వారివి అంటూ డింపుల్ కపాడియా డేరింగ్ స్టేట్‌మెంట్ ఇస్తోంది.

'చెప్పకుండా ఎలా వుంటాను? థిక్కెస్ట్ ఫ్రెండ్‌వనే కాకుండా చాలా బుద్ధిమంతుడవని, ఆడగాలి తగిల్తే ఆమడదూరం పరుగెత్తుతావనీ కూడా చెప్పా' అన్నాడు మురళి.

'ఒరేయ్.. ఒరేయ్.. నిజంగా నువ్వు చాలా మంచివాడివిరా. ఓ అందమైన ఆడపిల్ల.. నేనింకా ఆ అమ్మాయిని చూళ్ళేదుమకో.. నువ్వు చెప్పావ్ కదా! నీ ఖురించి కాక పరాయి వ్యక్తి గురించడిగితే ఇంత నిజాయితీగా చెప్పేవాళ్ళెవరుంటార్రా ఈ రోజుల్లో?' అన్నాడు వినోద్, మురళి చేతులుపట్టుకుని ఊపేస్తూ.

'ఆగాగు.. అలా ఎందుకు చెప్పావని అడగవే?' అని, 'మీ దక్షిణపు గది కిటికీలోంచి నిముషానికొకసారి మూతి బయటకుపెట్టి దుంచులా మా ఇంటివైపు చూస్తాడెందుకు మీ ఫ్రెండ్? అని అడిగిందిరా. అందుకే నువ్వు బుద్ధిమంతుడవని చెప్పాల్సొచ్చిందిరా' అన్నాడు మురళి. 'ఇందులో నా గొప్పేం లేదన్నట్టుగా'

'నిజంగా అంతమాటందిరా! నేనింతవరకు ప్రియంవదను చూడనే లేదు. వస్తేప్పుడు చూసిందిరా ఆ మహాతల్లి! చూడబోతే ఇదేదో నా కంటికో, వంటికోవచ్చినట్టుగా వుందిరాదేవుడో!' అని వాపోయాడు.

'కంగారు పడకు, నేనున్నాగా! ఒకవేళ అటువంటిదేమైనా జరగబోయేట్టుగా వుంటే నేను చూస్తూ వురుకుంటానా? చక్రం అడ్డువేయనా?' అన్నాడు మురళి.

'అలా అయితే ఇంకేం? ఎలాగైనా నాకా అమ్మాయిని పరిచయం చేయరా? బాబ్బాబు' అని బ్రతిమాలుకున్నాడు వినోద్, మిత్రుడిని.

మురళి ఓ నిమిషం ఆలోచించి 'రేపు ఉదయం ఎనిమిదిన్నరకు మా ఇంటికి రా. సరిగ్గా ఆసమయానికి ప్రియంవద కాలేజీకి బయలుదేరుతుంది' అన్నాడు.

'థాంక్స్‌రా! నీమేలీ జన్మకు మరిచిపోను' అన్నాడు వినోద్ ఆనందంగా.

'ఇతనేనా మీ ఫ్రెండ్?' అంది ప్రియంవద. వినోద్‌ను ఎగాదిగా చూస్తూ. తలూపాడు మురళీ.

వినోద్ చేష్టలుడిగి అలాగే చూస్తుండి పోయాడు ప్రియంవదవైపు.

ఆమె వేసుకున్న చుడీదార్ రెడిమేడ్‌ది కాదు. షాపులో గుడ్డకొని, కొలతలిచ్చి లేటెస్ట్ డిజైన్‌లో కుట్టించినట్టుగా వుంది. కుట్టిన టైలర్ ఎవరో గానీ, ఎక్కడా మడతలు లేకుండా, సరిగ్గా ఎక్కడ ఏమేరకు కత్తిరించాలో అంతవరకే కత్తిరించి, అత్యంత శ్రద్ధతో కుట్టినట్టుగా చాలా చక్కగా అమరిందా డ్రస్‌ప్రియంవదకు.

తలనుంచి కాళ్ళవరకు ప్రతివంపులోను అందం తొణికిసలాడ్తోంది ప్రియంవదలో. నీట్‌గా ట్రిమ్ చేయబడిన జుట్టు భుజాల వరకు వేళ్ళాడుతూ, గాలి వీచినప్పుడల్లా ఎగిరెగిరిపడుతోంది.

ఆమె కళ్ళు తేనెరంగులో వున్నాయి.

ఆమె ముక్కుపుటాలు పలచగా వుండడం వల్లేమో, గాలి పీల్చి వదిలినప్పుడల్లా సన్నగా కంపిస్తున్నాయి.

పెదాలు రెండు విల్లుబద్దల్లా వంగి, నోటికికాపలా కాస్తున్నాయి. పెదాలకు ఓ పక్కగా కుడిబుగ్గమీద కాటుక రంగులో వున్న పెసరగింజంత పుట్టుమచ్చ ఆమె మొహానికో వింతశోభను చేకూర్చుతోంది.

ఆమె మెడనుంచి వేళ్ళాడుతున్న ఒంటిపేట గొలుసు మధ్యభాగం ఎక్కడా చిక్కుపడిందో, ఎంత కళ్ళు విప్పార్చుకుని చూసినా కనబడలేదు వినోద్‌కు.

ఓ పదిక్షణాల సేపు తనూ అతడిని పరిశీలించి, టిక్కుటిక్కునడకతో వయ్యారాలొలికిస్తూ ముందుకు నడిచింది ప్రియంవద.

మురళి ఆమె పక్కనే నడుస్తోంటే, తను అడుగుదూరంలో ఆమె వెనుకే నడుస్తూ, మనసుకు పనిచెప్పడంలో నిమగ్నమై పోయాడు వినోద్. దార్లో ఎదురైన మగవాళ్ళంతా తమవైపు ఈర్ష్యగా చూడడం గమనించి చాలా సంబరపడిపోయాడు వినోద్.

నడుస్తున్నంత సేపు ప్రియంవద ఏదో మాట్లాడుతూనే వుంది. అన్నిటికీ మురళే సమాధానం చెబుతున్నాడు. తమ కాలేజి గేట్ వరకూ వచ్చాక మిత్రులిద్దరివైపూ తనకుడి చేతినోసారి గాల్లోకి షోగ్గా ఊపి 'బా..య్' అంటూ కాలేజీలోకి అడుగుపెట్టిందామె.

ఆమె కనుమరుగయ్యాక, అది నడిరోడ్డనే విషయాన్ని కూడా మరిచి, మురళిని గట్టిగా కౌగలించుకుని బావురుమన్నాడు వినోద్. మిత్రుడి చర్యకు బిత్తరపోయి, అతణ్ణి అతి కష్టం మీద విడిపించుకుంటూ "ఏమైందిరా నీకూ?" అన్నాడు మురళి అయోమయంగా చూస్తూ.

"ప్రియంవద లేకుండా నేను బ్రతకలేనురా" అన్నాడు వినోద్, ఇంకా బెక్కుతూ. జేబులోంచి కర్చీఫ్ తీసి అతడి కళ్ళు అద్దుతూ "ఓరి పిచ్చి సన్నాసీ. ఇలా ఏడవడానికేనా, ప్రియంవదను పరిచయం చేయమని నా ప్రాణాలు తీసింది?" అన్నాడు మురళి.

"నువ్వు నాకు సాయం చేయకపోతే నేను బ్రతకనురా" అని మళ్లీ రాగాన్నందుకోబోయాడు వినోద్.

"ఇహ ఏడుపాపు! అసలే ఏడ్చేవాళ్ళంటే ప్రియంవదకు వళ్ళు మంట" అన్నాడు మురళి.

టక్కున ఏడుపాపేసి మిత్రుడివైపు దీనంగా చూశాడు వినోద్. అప్పటికే రోడ్డు మీద అటూ ఇటూ వెళ్తోన్న జనం ఆగి, వాళ్ళిద్దరివైపూ కుతూహలంగా చూస్తున్నారు. ఒక్క విసురుతో మిత్రుడి చేయందుకుని వేగంగా నడవడం ప్రారంభించాడు మురళి.

"ఒరేయ్. నువ్వేం చేస్తావో నాకు తెలీదు కానీ ప్రియంవద నాక్కావాలిరా. ఆమె లేకుండా నేను బ్రతకలేనురా" అంటూ దారి పొడుగునా గొణుగుతూనే ఉన్నాడు వినోద్.

* * *

"నీ మనసులో మాట ప్రియంవదకు చెప్పాన్రా" అన్నాడు మురళి.

వెంటనే మురళిని దగ్గరకు లాక్కుని అతడి బుగ్గమీద గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు వినోద్.

"నీ ఫిజిక్ తనకు బాగా నచ్చిందట. నీ గొంతు మాస్లీగా ఉంటుందట. నీ నడక స్టైలిష్గా ఉంటుందట. నీ కళ్లెప్పుడూ ఏదో అన్వేషిస్తున్నట్టు ఉంటాయట. నీ ఛాతీ..."

అప్పటికే వినోద్ ఛాతీ ఆరంగుళాలు పెరిగిపోయింది. బలంగా గాలి పీల్చి వదులుతూ "మరి నా కామెను చూస్తే ఎలా అనిపించిదో చెప్పలేకపోయానా?" అన్నడు వినోద్ ఉబ్బి తబ్బిబ్బైపోతూ.



**పాపం జూహీ!**

నోటి దురుసుకు పెట్టింది పేరైనా జూహీ చావ్లా క్రమంగా అవకాశాలకు దూరమై తనకితానే భారమై ( వెయిట్ బాగా పెరిగిపోయి) ఎట్టకేలకు బుద్ధి తెచ్చుకుని ఇప్పుడిప్పుడే మారుతోందట! ఎక్సర్ సైజులు చెయ్యడం, సెట్లో అందరితో కలువుగోరుగా వుండడం చేస్తోందట. అయినా సరే ఈవిడ తీరుపై అనుమానం పోనీ నిర్మాతలు ఛాన్సుల సంగతి తర్వాత, ముందు మంచి ఫిగర్ మైంటేన్ చెయ్యండని తప్పుకొని పోతున్నారట.

"చెప్పకుండా ఎలా ఉంటాన్రా? ఆమె పెదాలు ముగ్గిన దొండపళ్ళలా ఎర్రగా ఉంటాయనీ, గొంతు విప్పితే కోకిల పాడినట్టుగా ఉంటుందనీ, చేతులు తామరతూడుల్లా ఉంటాయనీ, కళ్ళు చేప పిల్ల కళ్ళలా మిలమిలా మెరుస్తూంటాయనీ, నువ్వు చెప్పినట్టుగానే చెప్పాను" అన్నాడు మురళి.

"నిజంగా నువ్వెంత గుడ్ బాయ్విరా మురళీ, నీ వంటి గొప్ప వ్యక్తి నాకు స్నేహితుడుగా దొరకటం..." అంటూ ఏదో గుర్తొచ్చినట్టు ఆగిపోయి "అవునూ... నిజంగానే నా గురించి ప్రియంవద అలా అందిరా?!" అన్నాడు వినోద్.

"నీకంతా అనుమానమే.. ఇహ నుంచీ నువ్వే డైరెక్ట్గా ఆమెతో మాట్లాడుకో" అన్నాడు మురళి బుంగమూతి పెడుతూ. "అలా అనకురా... బాబ్బాబు... పొరపాటైపోయింది. ఇప్పుడు నువ్వు పక్కకు తప్పుకున్నావంటే నాకు చావే గతి" అన్నాడు వినోద్. మిత్రుడి గడ్డం పట్టుకుని బ్రతిమాలుతూ.

"సర్లే.. సర్లే.." అన్నాడు మురళి మెత్తబడుతూ.

"హమ్మయ్య..." అని నిట్టూర్చి, "ఈసారి నాగురించడిగితే ఏం చెప్తావ్రా?" అన్నాడు వినోద్.

"నువ్వే చెప్పు, ఏం చెప్పాలో?" అన్నాడు మురళి, చేతిలోని పెన్సిల్తో టెక్స్ట్ బుక్లో అండర్లైన్ చేస్తూ.

"ఏం చెప్తావంటే... పై పై వర్ణనలైపోయాయి కదా! ఈసారి మరికాస్త డీప్గా వెళ్తే బావుంటుంది" అన్నాడు వినోద్.

పుస్తకంలోంచి తలెత్తి మిత్రుడి వైపు చూస్తూ అన్నాడు మురళి. "డీప్గా అంటే?"

"అదేరా... కళ్ళూ, ముక్కూ, నోరూ, చెవులూ, మాటా, చేతులూ.. వీటి గురించి చెప్పడమైపోయిందిగా" అన్నాడు వినోద్ తటపటాయిస్తూ.

"ఆ... అయితే?!" అర్థంకానట్టుగా మొహం పెట్టాడు మురళి.

'ఇహ.. మెడ దిగువభాగం గురించన్నమాట..' అనబోయిన వినోద్ను ఆపి.

'ఆపావు.. ఇంతవరకూ నా దవడ పగలకపోవడం నా అదృష్టం! ఇప్పుడివన్నీ పట్టుకెళ్ళి ఇలాగే ప్రియంవదతో చెప్తాననుకో! ఏం అవుతుందో తెలుసా?' అన్నాడు మురళి.

వినడానికే భయంగా వుందన్నట్టుగా కళ్ళూ, చెవులు గట్టిగా మూసుకుని 'ఊ' అన్నాడు వినోద్.

'నా పళ్ళు రాలగొట్టి చేతిలో పెట్టి మరీ పంపించేస్తుంది. నీ తిప్పలేవో నువ్వు పడు. నన్నీ గొడవలోకి లాగకు' అన్నాడు మురళి.

'ప్లీజ్. నా బంగారు కొండవు కదూ? ఇంత వరకు వచ్చాక సాయం చేయనంటే ఎలారా?' అని ఒక్కక్షణం ఆలోచించి 'పోనీ చెప్పొద్దులే. ఇవన్నీ ఉత్తరంలో రాస్తాను. ఆఉత్తరాన్ని ప్రియంవద కందచెయ్ చాలు' అన్నాడు వినోద్.

అయిష్టంగా తలూపాడు మురళి.

రెండ్రోజుల తర్వాత ఓ ఉత్తరాన్ని మిత్రుడకందించాడు మురళి.

'ఏం రాసుంటుందిరా ప్రియంవద ఇందులో?' అన్నాడు వినోద్,ఉత్తరాన్ని జాగ్రత్తగా చించుతూ.

'ఏమో. నాకేం తెలుసు? ఈ ఉత్తరం నీకిమ్మంది.అలానే పట్టుకొచ్చి నీకిచ్చానంతే!' అన్నాడు మురళి.

చాలా చిన్న ఉత్తరం అది. సంబోధనా, సంతకమూ ఏమీ లేవు. మూడే వాక్యాలున్నాయందులో

'మగాళ్ళ నామడ దూరంలో వుంచే నేను, నిన్ను చూడగానే ఎందుకో ఆకర్షింప బడ్డాను. నీతో ముఖాముఖి మాట్లాడాలని నేను సంబరపడుతుంటే నువ్వెందుకిలా దాగుడుమూతలాడుతున్నావ్? ఈరోజు సాయంత్రం శివాలయం దగ్గరకు వస్తే అన్నివిషయాలు మాట్లాడుకోవచ్చు.

'హుర్రే!' అని అరుస్తూ మిత్రుడి నడుం చుట్టూ రెండు చేతులూ బిగించి అతడిని గిరిగిరా తిప్పేశాడు వినోద్.

'నేన్నిజంగా నీకంత బాగానచ్చానా?' అంది ప్రియంవద. కాలితో నీళ్ళను తపతపా కొడుతూ.

ఎప్పుడూ చుడీదార్ డ్రస్లో బయట తిరిగే ప్రియంవద అప్పుడు లంగా, ఓణీల్లోవుంది. శివాలయాన్ని ఆనుకుని వున్న కోనేటి మెట్లమీద కూర్చుని వున్నారు వారిరువురూ. చివరి మెట్టుమీద కూర్చుని కాళ్ళను నీటిలో ఆడిస్తోంది ప్రియంవద.

ఆమెవైపు అనుమానంగా చూస్తూ తలూపాడు వినోద్.

'నాలో నీకంతగా నచ్చిందేవిటో?' అంది ప్రియంవద తిరిగి.

కోనేట్లో అక్కడక్కడ ఎగిరి పడుతున్న చేపపిల్లల్ని చూస్తూ మౌనంగా వుండిపోయాడు వినోద్.

'నా కళ్ళు బావుంటాయన్నావట..

ముక్కు చక్కగా వుంటుందన్నావట..

పెదాలు మగ్గిన దొండపళ్ళలా ఎర్రగా వుంటాయన్నావట..

నడుం దగ్గర కర్వే పిచ్చెక్కిస్తుందన్నావట.." అంది ప్రియంవద అతడిని ఓరగా చూస్తూ.

గుటకలు మింగాడు వినోద్.

'నఖశిఖ పర్యంతమూ నన్నలా వర్ణించడమే కాకుండా నిన్న ఓ పెద్ద ఉత్తరం కూడా పంపించావ్‌గా మురళి చేత! ఆ ఉత్తరంలో మాత్రం ఎన్నెన్ని వ్రాశావనీ.. ఓహ్! నువ్వు రాసిన ఉత్తరం ఎంత టెమ్టింగ్‌గా వుందంటే.. నేను కరోడా దాన్ని కాబట్టి సరిపోయింది గానీ.. అదే మరో అమాయకపు ఆడపిల్లైతే, నీ ఉత్తరం చదవడం పూర్తయ్యే సరికి గర్భం కూడా ధరించి వుండేది. అంత గొప్పగా రాశావ్! నీకు నా హృదయపూర్వక అభినందనలు!' అంది ప్రియంవద నవ్వుమొహంతో అతడి వైపు చూస్తూ.

చిన్నగ తలెత్తి చూశాడు వినోద్.

ఆమె మనసులో ఏం వుందో తెలియడం లేదు. 'తన జుట్టు పట్టుకుని నీట్లో ముంచేయదు కదా?' అనిపించి, అంతలోనే 'తనంటే ఇష్టమని రాసింది కదా, అంతపని చేయద'ని సరిపెట్టుకున్నాడు మనసులో.

తిరిగి అంది ప్రియంవద 'ఎందుకో తెలియదుగానీ,నిన్ను చూసిన తొలి క్షణంలోనే, 'నువ్వు బావున్నావు!' అంది నా మనసు. కానీ తరువాత నువ్వు నాతో మనసు విప్పి మాట్లాడేందుకు ప్రయత్నించకుండా, మురళిద్వారా నీ మనసులోని భావాల్ని చెప్పించినపుడు, కొంచెం పిరికితనం కూడా నీలో వుందని అర్థమైంది నాకు..'

దెబ్బతిన్నట్టుగా చూశాడు వినోద్.

'పోనీలే.. గతంలో మగవాళ్ళ పట్ల నా ప్రవర్తనను గురించి చూచాయిగా తెలియడం వల్ల భయపడుతున్నావేమో అనుకున్నాను'

'అంతే.. అంతే!' అన్నట్టుగా మెచ్చుకోలుగా చూశాడు వినోద్ ఆమెవైపు.


'..కానీ.. నా అవయవ సౌందర్యాన్ని, అంగాంగాల పొంకాన్ని, నిస్సిగ్గుగా, వయసులో వున్న మరో మగాడి ముందు వర్ణించడమే కాకుండా, మన పెళ్ళయ్యాక ఏమేం చేయాలనుందో, ఎలా మురిపించాలని వుందో.. వివరంగా ఉత్తరం రాసి మురళి చేతికిచ్చి నాకందజేయమన్నావు. మురళి నిజాయితీ కలవాడు కనుక సరిపోయింది. అదే ఆ ఉత్తరంలో రాసిన విషయాలన్నీ అతడు చదివి, తర్వాత నాకందజేసి వుంటే, మున్ముందు ఒకవేళ నేను నీకు భార్యనైనా కూడా.. అతడి ముందు నేను తలెత్తుకోగలనా? అనే విషయం గురించి ఆలోచించావా?'


పరిస్థితిలా మారడంతో కంగారు పడిపోయాడు వినోద్. గొంతు పెగుల్చుకుని ఏదో చెప్పబోయాడు.

'ఆగు.. నువ్వేం చెప్తావు. నువ్వు పిరికివాడివే కాదు. ముందు చూపులేని వాడివి కూడా. మనసు పడిన స్త్రీతో జీవితాంతం కలిసి బ్రతకాలనే కోరికైతే నీలో మెండుగా వుంది కానీ. అందుకు మరొకరి మీద ఆధారపడకూడదనే ఇంగితం మాత్రం లేదు. అందుకే నీ మీద జనించిన ఇష్టం క్రమేణా అసహ్యంగా రూపుదిద్దుకుంది నాలో.

నీ మాటల్ని యథాతథంగా నాకు అప్పజెప్పిన మురళి నిజాయితీ నాకెంతో నచ్చింది. ఐలవ్ హిమ్! మా ఇద్దరి చదువులూ పూర్తయ్యాక పెళ్ళి శుభలేఖ పంపిస్తాం. జస్ట్ ఫార్మాలిటీ సేక్! అంతే! మా పెళ్ళికి నువ్వు రాకుండా వుంటేనే నేను సంతోషిస్తాను.

ఇప్పటికైనా ఒక్క విషయం గుర్తు పెట్టుకో! రాయబారి, రాజుకన్నా గొప్పవాడైతే ఆ రాజుకే నష్టం. ప్రేమరాయబారాల్లో ఇది మరీ నిజం! నీ పొరపాటల్లా నీకంటే అన్ని విధాలా ఉన్నతుడైన మురళిని మన మధ్య రాయబారానికి ఎన్నుకోవడమే! ఇకముందైనా ఆ పొరపాటు జరగకుండా జాగ్రత్తపడు. బెస్టాఫ్ లక్!" అంది ప్రియంవద.



దళిత, స్త్రీ వాదాలు ఈయుగ వాస్తవాలు ఎవరెన్ని రకాలుగా వక్రించినా వాస్తవం దాగదు

ఓల్గా, జయప్రభ, కత్తి పద్మారావు, సత్యమూర్తి, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి, పైడి తెరేష్‌బాబు స్పందన అతిథ్యరలో...